Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్దతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 365 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 22 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com

RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## విశాఖలో ప్రారంభమైన అంతర్జాతీయ యోగా దినోత్సవం.. ప్రధాని మోదీ హాజరు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సాగర తీరంలోని విశాఖ పట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ భారీ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా హాజరయ్యారు. యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే థీమ్‌తో మొదలైన ఈ కార్యక్రమం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025 పేరిట నిర్వహించబడుతోంది. ఆర్కే బీచ్ నుంచి భీమునిపట్నం వరకు 26 కిలోమీటర్ల పొడవునా 247 యోగా విభాగాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రజాప్రతినిధులు, కేంద్ర మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పాఠ శాల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్లు, యోగా సంఘాలు, నౌకాదళం, కోస్టల్ గార్డు సభ్యులు, పారిశ్రామికవేత్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 7 గంటలకు 2 లక్షల 70 వేలు దాటిన యోగీలు. సూరత్‌లో 1,47,952 మంది రికార్డ్ అధిగమించడంతో ప్రభుత్వ వర్గాల్లో ఆనందం. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు కానున్న విశాఖ యోగా కార్యక్రమం. శుక్రవారం సాయంత్రం భువనేశ్వర్ నుంచి విశాఖ చేరుకున్న ప్రధాని మోదీ, ఈస్ట్రన్ నేవల్ కమాండ్ వద్ద బస చేశారు. శనివారం ఉదయం 6:25 గంటలకు ఆర్కే బీచ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి మాత్రమే కాక, ప్రపంచ ఐక్యతకు కూడా దోహదపడుతుందని ప్రధాని పేర్కొన్నారు.

**2015 నుంచి ప్రతి ఏటా..**

ప్రధాని మోదీ 2014లో యోగా దినోత్సవ ప్రతిపాదన చేయడంతో, 2015 నుంచి జూన్ 21న ఈ వేడుకలు జరుగుతున్నాయి. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ప్రజలు దీని పట్ల చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఈరోజు ఉదయం 6.30 నుంచి ఉదయం 7 గంటల వరకు దేశంలోని లక్షకు పైగా ప్రదేశాలలో సామూహిక యోగా ప్రదర్శనలు చేశారు.

## యోగా గ్రాండ్ సక్సెస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** యోగాడే నిర్వహణ, గ్రాండ్ సక్సెస్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈరోజు (శనివారం) విశాఖ కలెక్టర్ కార్యాలయంలో మంత్రులు, అధికారులతో సీఎం రివ్యూ చేపట్టారు. సమావేశ మందిరంలోకి సీఎం చంద్రబాబుకు కరతాళధ్వనులతో మంత్రులు, అధికారులు స్వాగతం పలికారు. విశాఖతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఇంటర్నేషనల్ యోగా డే జరిగిన తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా పలు ప్రపంచ రికార్డుల సాధనపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉద్యోగులు, అధికారులకు సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రజల సహకారం, భాగస్వామ్యం, అన్ని విభాగాల సమన్వయంతో యోగా డే గ్రాండ్ సక్సెస్ అయ్యిందన్నారు ముఖ్యమంత్రి. మంచి కార్యక్రమంలో ఇదో గొప్ప ముందడుగు అని వ్యాఖ్యానించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతో బాధ్యత తీసుకుని పనిచేసిన తీరుకు అభినందనలు తెలిపారు. అర్ధరాత్రి 2 గంటల నుంచే ప్రజలు తరలిరావడం ఆశ్చర్యాన్ని కలిగించిందని కొందరు అధికారులు తెలిపారు. విశాఖ యోగా డేలో 3 లక్షల మందికి పైగా యోగా సాధనలో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. పాల్గొన్నవారి లెక్కింపులో క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం తిరుగులేని ఫలితాన్ని ఇచ్చిందని మంత్రులు పేర్కొన్నారు.

## విశాఖను ఐటీ హబ్‌గా మలిచే దిశగా లోకేష్..ఐదు లక్షల ఉద్యోగాల హామీ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఏపీలోని విశాఖలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంపై మంత్రి నారా లోకేష్ తాజాగా స్పందించారు. ఈ కార్యక్రమం నిర్వహణపై సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రుల కోరికలను నెరవేర్చుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. యోగాంధ్ర విజయవంతంగా నిర్వహించబడటంతో, మాకు గురుతర బాధ్యత నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రెండు వరల్డ్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పినట్లు చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అట్రాక్షన్‌గా నిలిచిందన్నారు.

**అనుకున్న దానికంటే..**

ప్రధానికి గిన్నిస్ రికార్డు కానుక ఇవ్వాలని యోగాంధ్ర నిర్వహించామని, ఆశించిన దానికంటే ఎక్కువ మంది దీని కోసం వచ్చినట్లు చెప్పారు. ఈ క్రమంలో ప్రజల్లో వచ్చిన చైతన్యం వల్లనే యోగాంధ్ర విజయవంతమైందని మంత్రి లోకేష్ అన్నారు. ప్రధాని మోదీ అభినందించడం తనకు చాలా ఆనందంగా ఉందని, ఆయన పిలుపు మేరకు ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారని వెల్లడించారు. ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేయడం వల్లే యోగాంధ్ర ప్రశాంతంగా ముగిసిందన్నారు. ప్రధాని వ్యాఖ్యలను బాధ్యతగా స్వీకరిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

**99 పైసలకే ఎకరా భూమి**

'యోగాంధ్ర కార్యక్రమం ఆంధ్రుల విజయం. అన్ని ప్రాంతాలకు అభివృద్ధిని వికేంద్రీకరిస్తాం. దక్షిణ భారతదేశంలో ఉన్నతమైన ఐటీ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దుతామని' మంత్రి లోకేష్ ఈ సందర్భంగా తెలిపారు. విశాఖలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలు




తీసుకు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఐటీని ప్రోత్సహించాలంటే మెరుగైన సదుపాయాలు అందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. 99 పైసలకే ఎకరా భూమి ఇవ్వడం వల్ల టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు రాష్ట్రంలోకి వచ్చాయని మంత్రి లోకేష్ వివరించారు.

**రాష్ట్రానికి ఒక కొత్త దిశ**


ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, రాష్ట్రం ఆర్థిక స్థితిని మెరుగుపరచడం వంటి అంశాలు ముఖ్యమైనవని ప్రస్తావించారు మంత్రి లోకేష్. మా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. యువతకు మంచి అవకాశాలు కల్పించడం, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడటమే మా లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ విధంగా యోగాంధ్ర కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక కొత్త దిశను చూపించిందన్నారు. ప్రజల చైతన్యం, ప్రభుత్వ చర్యలు, ప్రైవేట్ రంగం సహకారం కలిసినప్పుడు రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు నారా లోకేష్.

## సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించం...తేల్చి చెప్పిన అమిత్‌షా

**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై కఠిన చర్యల్లో భాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేయడం ద్వారా దాయాది దేశానికి ముకుతాడు వేసింది. ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించే అవకాశం ఉందా? దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శనివారంనాడు ఒక ఇంటర్వ్యూలో స్పష్టత ఇచ్చారు. పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని ఆయన సమాధానమిచ్చారు. ఈ ఒప్పందాన్ని ఏకపక్షంగా తాము రద్దు చేయలేదని, పాకిస్థాన్ పదేపదే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతుండటంతో చట్టపరంగా ఒప్పందాన్ని సస్పెండ్ చేశామని చెప్పారు. 'లేదు, ఎప్పటికీ ఒప్పందాన్ని పునరుద్ధరించం. అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయకూడదు. అయితే తాత్కాలికంగా నిలిపివేసే హక్కు మాకు ఉంది' అని అమిత్‌షా తెలిపారు. 1960 ఒప్పందంలోని ప్రియాంబుల్‌ను ప్రస్తావిస్తూ, ఇండియా-పాకిస్థాన్ మధ్య శాంతి, ప్రగతికి ఉద్దేశించినట్టు అందులో చెప్పడం జరిగిందని అన్నారు. అయితే దానిని ఉల్లంఘించడం అంటూ జరిగితే ఒప్పందానికి అర్థమే లేకుండా పోతుందని అన్నారు.

**కెనాల్ ద్వారా రాజస్థాన్‌కు..**

తమకు హక్కుభుక్తమైన జలాలను తాము సక్రమంగా వినియోగించుకుంటామని, కెనాల్ నిర్మాణం ద్వారా నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తామని చెప్పారు. ఏప్రిల్ 21న జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై మాట్లాడుతూ, కశ్మీర్‌లో శాంతి, పర్యాటకాన్ని దెబ్బతీసి, కశ్మీర్ యువకులను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడి జరిగిందని చెప్పారు. కశ్మీర్‌తో పాటు యావద్దేశం ఈ ఉగ్రదాడికి వ్యతిరేకంగా సంఘీభావం తెలిపిందన్నారు. పాకిస్థాన్ ఎంచుకున్న మార్గాన్ని ఏమాత్రం జాప్యం చేయకుండా తిప్పికొట్టామని చెప్పారు. జనావాసాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ దాడులు జరపడంతో పాక్ ఎయిర్‌బేస్‌లను ఇండియా ధ్వంసం చేసిందని, కాల్పుల విరమణకు పాక్ కోరడంతో అందుకు అంగీకరించామని చెప్పారు. పహల్గాం దాడికి ప్రతిగా ఉగ్రవాద స్థావరాలకు మాత్రమే దాడులను పరిమితం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్థిరనిశ్చయంతో ఉన్నారని అమిత్‌షా చెప్పారు. 'కేవలం లక్షిత దాడులకే మేము పరిమితం అవుతున్నామని చాలా స్పష్టంగా చెప్పాం. అయితే టెర్రరిస్టులపై మనం చేసిన దాడులను తమ భూభాగంపై జరిపిన దాడులుగానే పాకిస్థాన్ భావిస్తూ వచ్చింది' అని ఆయన వివరించారు.



**కాంగ్రెస్‌కు ఆ హక్కు లేదు**


ఆపరేషన్ సిందూర్‌తో సహా భారతదేశం తీసుకున్న మిలటరీ చర్య లపై కాంగ్రెస్ చేసిన విమర్శలను అమిత్‌షా తిప్పికొట్టారు. కాంగ్రెస్ తమ హయాంలో ఏమి చేసింది? మంత్రిని మార్చడం మినహా వాళ్లు చేసిందేమీ లేదు. ఉగ్రవాదంపై కాంగ్రెస్ సహా ఏ రాజకీయ పార్టీకీ తమను విమర్శించే హక్కులేదని అమిత్‌షా స్పష్టం చేశారు.

## విజయవాడ ఆస్పత్రికి చెవిరెడ్డి.. ఏమైందంటే...




**విజయవాడ, (రాజధాని వార్తలు):** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన ఆయన జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయితే ఈరోజు (శనివారం) ఉదయం గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ముందుగా జైలులో ఉన్న వైద్యులతో పరీక్షలు చేయించారు. ఆపై ముందస్తు జాగ్రత్తగా ఆయనను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజియోథెరపీలో మాజీ ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు నిర్వహించారు డాక్టర్లు. వైద్య పరీక్షలు పూర్తి అయ్యాయి. ఈరోజు సాయంత్రం వరకు వైద్యుల పర్యవేక్షణలోనే మాజీ ఎమ్మెల్యే ఉండనున్నారు. అయితే ప్రాణాపాయం ఏమీ లేదని.. సాయంత్రం వరకు పర్యవేక్షణలో ఉంచి మందులు ఇచ్చి పంపిస్తామని వైద్యులు చెబుతున్నారు. దీంతో ఈరోజు సాయంత్రానికి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అధికారులు జిల్లా జైలుకు తరలించనున్నారు. ఇక ఈ కేసుకు సంబంధించి నిన్న (శుక్రవారం) విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ వేశారు. చెవిరెడ్డిని ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు అదే సమయంలో చెవిరెడ్డి తరఫు న్యాయవాదులు కూడా బెయిల్ మంజూరు చేయాలంటూ పిటిషన్ వేశారు. అలాగే తనకు జైలు భోజనం పడటం లేదని ఇంటి నుంచి తెచ్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. వీటికి సంబంధించి సోమవారం (ఈనెల 23) విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణకు రానుంది.

## భార్యపై అనుమానం.. బిడ్డలపై ఘాతుకం... రవిశంకర్ అరెస్ట్



**ఎన్టీఆర్ జిల్లా, (రాజధాని వార్తలు):** కన్నబిడ్డలను కడతేర్చిన కర్కశ తండ్రిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 12న తన బిడ్డలు లక్ష్మీ హిరణ్య, లీలాసాయిలను కన్నతండ్రి రవిశంకర్ దారుణంగా హత్య చేశాడు. ఆపై తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి సదరు తండ్రి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రవిశంకర్ కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు అతడి కాల్ డీటెయిల్స్ లోకేషన్ ఆధారంగా రవిశంకర్‌ను గుర్తించారు పోలీసులు. దాదాపు పది రోజుల తర్వాత సింహాచలం అప్పన్న ఆలయంలో రవిశంకర్ ఉన్నట్లు గుర్తించిన మైలవరం పోలీసులు... గురువారం రాత్రి అక్కడకు వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని రెండు రోజులుగా మైలవరంలోని రహస్య ప్రదేశంలో ఉంచి విచారించారు. చివరకు బిడ్డలను తానే చంపానని.. భార్యపై అనుమానంతోనే హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. రవిశంకర్ భార్య ఉద్యోగం నిమిత్తం విదేశాలకు వెళ్లింది. తొలి నుంచి భార్యపై అనుమానంతో ఉన్న రవిశంకర్.. ఆమె విదేశాలకు వెళ్లడంతో తన క్రూరత్వాన్ని బయటపెట్టాడు. పిల్లలను చంపేందుకు మూడు నెలల నుంచి ప్లాన్ చేశాడు. చివరకు తన ఇద్దరు పిల్లలను కన్నతండ్రి అనే మమకారం లేకుండా కర్కశంగా మట్టుబెట్టాడు. అంతేకాకుండా ఈ కేసు నుంచి తప్పించుకునే క్రమంలో తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా లేఖ రాసి పరారయ్యాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. ఇక రవిశంకర్ లేఖతో అప్రమత్తమైన పోలీసులు అతడి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిజంగా ఆత్మహత్య చేసుకుంటాడని భావించిన పోలీసులు ఎన్నో చోట్ల గాలించారు. చివరకు అతడి కాల్ డేటా ఆధారంగా సింహాచలంలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. భార్యపై అనుమానంతోనే కన్న బిడ్డల్ని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పది రోజుల తర్వాత రవిశంకర్ దొరకడంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. అనుమానం పెనుభూతం అంటారు. భార్యా లేదా భర్త మనసుల్లో అనుమానం అనే బీజం పడితే అది ఎంతటి దారుణాలకైనా దారి తీస్తుంది. ఒక్కసారి భాగస్వామిపై అనుమానం మొదలైతే అది పెనుభూతంగా మారి వారి నిండైన జీవితాన్ని బలితీసుకుంటుంది. అనుమానంతో భార్యలను భర్తలు చంపిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అంతే కాకుండా దీని కారణంగా తమ కన్న బిడ్డలను కూడా బలితీసుకుంటున్న కఠినాత్ములు ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన కూడా అలాంటిదే. అనుమానమే రోగంతో కన్న బిడ్డలని కూడా చూడలేదు. కంటికి రెప్పలా బిడ్డలను కాపాడాల్సిన తండ్రి కాలయముడిగా మారాడు. చిన్నారుల మోములను చూసి కూడా ఆ తండ్రి మనసు కరగలేదు. చివరకు ఆ పసిబిడ్డల ప్రాణాలను బలితీసుకుని ఇప్పుడు జైలు ఊచలు లెక్కబెడుతున్నాడు.

# ఆదాలకు కృతజ్ఞతలు తెలిపిన మొయిళ్ల సురేష్ రెడ్డి, గౌరి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డిని శుక్రవారం ఆయన కార్యాలయంలో రాష్ట్ర జోనల్ మహిళా విభాగం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమితులైన కార్పొరేటర్ మొయిళ్ల గౌరి మర్యాదపూర్వం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మొయిళ్ల సురేష్ రెడ్డి, మొయిళ్ల గౌరి దంపతులు మాజీ ఎంపీ ఆదాలకు పుష్పగుచ్ఛం అందించిన దుశాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టత కోసం మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి మొయిళ్ల సురేష్ రెడ్డి, మొయిళ్ల గౌరి దంపతులకు సూచించి అభినందనలు తెలియజేశారు.

# అల్లూరులో ఆగని చోరీలు

**అల్లూరు, (రాజధాని వార్తలు):** మండల కేంద్రమైన అల్లూరులోని అంజయ్య నాయుడు కాలనీలో నివాసముంటున్న మహేష్ ఇంట్లో దుండగులు చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది . స్థానికుల కథనం మేరకు మహేష్ తన కుటుంబ సభ్యులతో కలసి గురువారం సాయంత్రం దైవ దర్శన నిమిత్తం తిరుమలకు వెళ్లారు. అనంతరం మహేష్ సోదరి వేణమ్మ తన సోదరుడు మహేష్ ఇంటి ముందు ముగ్గు వేసేందుకు శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి బయట గేటు తలుపులు తీసి ఉన్నాయి. తన సోదరుడు మహేష్ వచ్చాడేమోనన్న అనుమానంతో బయట గేటు తీసి లోపలికి వెళ్లి చూడగా ఇంటి తలుపులు కూడా తీసి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా పడక గదిలోని బీరువా తలుపులు తీసి అందులోని వస్తువులను అక్కడే చల్లాచెదరుగా పడి ఉన్నాయి. దీంతో వెంటనే ఆమె బయటకు వచ్చి ఇంటి పక్క వారిని పిలిచి జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో తన సోదరుడు మహేష్ ఇంట్లో దొంగతనం జరిగిందని భావించి స్థానికుల సహకారంతో తన సోదరుడికి ఫోన్ చేసి సమాచారాన్ని అందజేసింది. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు



సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనలో దొంగ ఇంటి తలుపులకు ఉన్న తాళాన్ని పగలగొట్టి ఇంట్లోకి చల్లబడి బీరువాలోని బంగారు ఆభరణాలు నగదను చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ చోరీలో పది సవర్లు బంగారు ఆభరణాలతో పాటు 70000 రూపాయల నగదును దుండగులు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. నెల రోజుల వ్యవధిలో అల్లూరులో ఏడు చోట్ల చోరీలు జరగటం పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.

# మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో మంత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకల్లో పలు సేవా కార్యక్రమాలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మత్స్యకార ముద్దుబిడ్డ, పేదల పెన్నిధి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవింద్ర జన్మదిన సందర్భంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సంప్రదాయం మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు సింహాచలంలో శ్రీ బంగారు తల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వితంతువులకు పండ్లు, రొట్టెలు మరియు ఒక్కొక్కరికి 25 కేజీలు బియ్యం చొప్పున 50 మందికి అందజేయడం జరిగింది. మరియు 12 గంటలకు విశాఖపట్నం వన్ టౌన్‌లో గల శ్రీ స్వామి వివేకా నంద స్వచ్ఛంద సేవా సంస్థ వద్ద పేదలకు అన్నసమారాధన, వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేయడం వంటి సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం అధ్యక్షులు, నడికుదుటి అర్జున్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, ముత్యాలమపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, మత్స్యకార నాయకులు, రాంబాబు, రమణరావు మాస్టర్, సాయి బలరాం, శ్రీనివాస్, అమ్మోరు, అప్పన్న, ముత్యాలరావు, సోమేశ్వరరావు, అప్పలరాజు బంగారురాజు, బుజ్జి, కొండబాబు, సోమేష్, అప్పారావు, ముత్యాల నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు





**వింజమూరు, (రాజధాని వార్తలు):** దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కుమార్తె, ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ తల్లి, నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పుట్టినరోజు కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేకును నాయకులు ఒకరికొకరు తినిపించుకున్నారు. భారీ ఎత్తున బాణా సంచాలు పేల్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి వేల కుటుంబాలకు అండగా ఉంటూ హెరిటేజ్ సంస్థ ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ, కష్టకాలంలో న్యాయం కోసం పోరాడిన వీర వనిత శ్రీమతి నారా భువనేశ్వరి అని కొనియాడారు. ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పుట్టం బ్రహ్మానంద రెడ్డి, సి హెచ్ బయన్న, ఎస్ కే రియాజ్, మాలేపాటి చైతన్య, తుమ్మల కిరణ్, ఐ టి డి పి అధ్యక్షులు పార్టీ నేతలు తదితరులు ఉన్నారు.

# ఐఐఎఫ్‌టీ క్యాంపస్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్





**యు.కొత్తపల్లి, (రాజధాని వార్తలు):** యు.కొత్తపల్లి మండలం, పొన్నాడ వద్ద 25 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రతిష్టాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐ.ఐ.ఎఫ్ టి) క్యాంపస్ నిర్మాణ పనులను శుక్రవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ముందుగా ఆయన సంబంధిత అధికారులు, గుత్తేదారుతో కలిసి క్యాంపస్‌లో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు, హాస్టల్ భవనాలు, ల్యాబ్‌తో పాటు ఇతర విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై పనులు పురోగతిపై చర్చించి నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని సూచిం చారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ. 229.81 కోట్ల వ్యయంతో మూడేళ్ల క్రితం క్యాంపస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వకుండా తాత్సారం చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కేవలం 20 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. ఈ దశలో కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత తాను వ్యక్తిగతంగా దీనిపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించడంతో ఏడాదిలోనే 80 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ వాటా నిధుల కోసం పలుమార్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, సంబంధిత శాఖ అధికారులను కలిసి ఒత్తిడి చేయగా కేంద్రం ఇటీవల రూ. 25 కోట్లు విడుదల చేసిం దన్నారు. నిధులు అందుబాటులో ఉన్నందున పనుల్లో వేగం పెంచి క్యాంపస్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకు రావాల న్నారు.కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల పెండింగ్ నిధుల కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. క్యాంపస్ నిర్మాణానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌లకు ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# వేగంగా ప్రజలకు రెవిన్యూ సేవలు : తాసిల్దార్ నాగరాజు





**సంగం, (రాజధాని వార్తలు):** ప్రజలకు వేగంగా రెవెన్యూ సేవలు అందుబాటులో ఉంటాయని తాసిల్దార్ నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన దుత్తలూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశిల్దార్ యనమల నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు పలువురు నాయకులు హాజరయ్యారు. ఇందులో భాగంగా అయినా రైతులకు భూ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెవిన్యూ దినోత్సవ కార్యక్రమం రెవెన్యూ సిబ్బంది ప్రతి ఒక్కరూ జరుపుకునే రోజేనని, అందులో భాగంగా ఈ రెవిన్యూ దినోత్సవ కార్యక్రమాన్ని మనం జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా రెవెన్యూ శాఖ తరపున పేదలకు భూపంపిణీ,ఇళ్ల స్థలాలు పంపిణీ కార్యక్రమం మరియు జనన మరణ ధ్రువీకరణ పత్రాలు ఇలా



ప్రతి కార్యక్రమాలు రెవెన్యూ అధికారుల వల్లే సాధ్యమవుతాయన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయనకు అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి రెవెన్యూ దినోత్సవ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఏలు, రేషన్ డీలర్లు, రైతులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


# ఐదు మండలాల మండల కమిటీలు ఎంపిక

## - పరిశీలకుల ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన, మండల నాయకుల సమక్షంలో ఎంపిక - పరిశీలకులుగా బాణా శ్రీనివాసులు రెడ్డి



**వింజమూరు, (రాజధాని వార్తలు):** ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు సీతారాంపురం కలిగిరి జలదంకి వింజమూరు మండలాల టిడిపి మండల కమిటీలను తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో గురువారం మండలపార్టీ పరిశీలికులు బాణా శ్రీనివాసులు రెడ్డి,బీద గిరిధర్, వేలూరి కేశవ చౌదరి, ఆర్ వీరేంద్ర చౌదరి, మన్నవ రవిచంద్రరావుల,ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన, మండల నాయకుల సమక్షంలో ఎంపిక చేశారు. ఈ కమిటీలను జిల్లా కమిటీలకు అక్కడనుండి రాష్ట్ర కమిటీలకు పంపించి, ఆమోదం పొందిన అనంతరం, ప్రకటించడం జరుగుతుందని పరిశీలకులు తెలియజేశారు. మండల పార్టీ పదవులు, కొన్ని ఏకగ్రీవం కాగా, మరికొన్ని పదవులకు, ఇద్దరు ముగ్గురు పేర్లు పంపించడం జరిగింది. అధిష్టానం ఆదేశాల మేరకు తుది మెరుగులు జాబితా తయారు చేయబడుతుంది. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కన్వీనర్లు పరిశీలకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆరవ వార్షికోత్సవ వేడుకలు : సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి





**సంగం, (రాజధాని వార్తలు):** సంగం మండలం వెంగారెడ్డి పాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ఆలయ ధర్మకర్త సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరవ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా హోమాలు చేసి సాయిబాబాకు అభిషేకాలు, కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువ



సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ధనుష్ తప్ప ఎవరూ అలాంటి సాహసం చేయలేరు!



ఇండియన్ సినీ రంగంలో ఉన్న గొప్ప నటుల్లో కోలీవుడ్ స్టార్ ధనుష్ కూడా ఒకడు. అయితే ధనుష్‌కు కేవలం తమిళంలోనే కాకుండా మిగిలిన భాషల్లో కూడా మంచి క్రేజ్ ఉంది. అందులో భాగంగానే ఇతర భాషల్లో కూడా సినిమాలు చేస్తూ కెరీర్లో ముందుకు దూసుకెళ్తున్నాడు ధనుష్. గతంలో ధనుష్ తెలుగులో సార్ అనే సినిమా చేసి బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకోగా ఇప్పుడు మరోసారి తెలుగు డైరెక్టర్‌తో కలిసి సినిమా చేశాడు. ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగార్జున కీలక పాత్రలో నటించిన సినిమా కుబేర. శుక్రవారం రిలీజైన ఈ సినిమా మొదటి షో నుంచే మంచి టాక్ తెచ్చుకుంది. కుబేరలో ధనుష్ నటనకు అన్ని వర్గాల ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. దేవా అనే బిచ్చగాడి పాత్రలోకి ధనుష్ పరకాయ ప్రవేశం చేసి మరీ నటించి అందరినీ మెప్పించాడు. కుబేరలోని ఫస్ట్ సీన్ నుంచి ఆఖరి సన్నివేశం వరకు ధనుష్ నటన అందరినీ ఆకట్టుకుంది. మరీ ముఖ్యంగా బిచ్చగాడిగా ఇంట్రడక్షన్ సీన్‌లో ధనుష్ చేసిన యాక్టింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. కుబేర చూశాక ధనుష్ తప్ప మరెవరూ ఆ పాత్రకు న్యాయం చేయలేరనిపిస్తుంది. న్యాయం సంగతి అలా ఉంచితే ధనుష్ తప్ప ఇంకెవరూ అలాంటి పాత్రలు చేసే సాహసం కూడా చేయరేమో అని అందరూ భావిస్తున్నారు. దేవా పాత్రలో ఎంతో అద్భుతంగా నటించి సినిమా మొత్తాన్ని తన భుజాలపై మోశాడు ధనుష్. ఒక్కమాటలో చెప్పాలంటే కుబేర సినిమా ధనుష్ కెరీర్లోనే బెస్ట్ మూవీగా నిలుస్తుందని అతని ఫ్యాన్స్ అంటున్నారు. పాజిటివ్ టాక్‌తో మొదలైన ఈ సినిమాకు ప్రస్తుతం ఎక్కడ చూసినా హౌస్ ఫుల్సే. అసలే గత కొంతకాలంగా సరైన సినిమా లేక థియేటర్లు డ్రైగా ఉన్న టైమ్‌లో కుబేర డిస్ట్రిబ్యూటర్లలో ఆశల్ని రేకెత్తిస్తుంది.

# ప్రొడ్యూసర్‌గా మారబోతోన్న మరో టాలీవుడ్ హీరో



ఈమధ్య కాలంలో టాలీవుడ్ హీరోలు వరుసగా నిర్మాణ బాధ్యతలతో మరింత బిజీ అవుతున్నారు. ఇప్పటికే నాని ఆ ట్రాక్‌లో దూసుకెళ్తున్నాడు. ఇక మరికొందరు స్టార్స్ కూడా ఇతర ప్రొడక్షన్‌లతో కలిసి అలా ముందుకు సాగుతున్నారు. ఇక ఇప్పుడు ఎనర్జిటిక్ స్టార్ రామ్ కూడా సొంతంగా సినిమా నిర్మాణంలోకి వెళుతున్నట్టు తెలుస్తోంది. తన కెరీర్‌లో మాస్ మేకోవర్‌తో ప్రయోగాలు చేస్తూ వచ్చినా.. ఇటీవల చేసిన కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో కొంత వెనుకబడినట్టే అయింది. ప్రస్తుతం 'ఆంధ్ర కింగ్ తాలూకా' అనే డిఫరెంట్ డ్రామాలో నటిస్తున్నాడు రామ్. ఇక ఈ సినిమాలో కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నాడు. పి.మహేష్ బాబు దర్శకత్వం వహిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ గ్రాండ్‌గా నిర్మిస్తోంది. అయితే సినిమా విడుదల తరువాత రామ్ తదుపరి ప్రాజెక్ట్ ఇంకా ప్రకటించలేదు.

లేటెస్ట్‌గా ఓ క్రేజీ అప్‌డేట్ సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. రామ్ త్వరలోనే తన స్వంత ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించబోతున్నాడట. ఇప్పటి వరకు స్రవంతి మూవీస్ బ్యానర్‌పై తన పెదనాన్న కిషోర్ ఆధ్వర్యంలో సినిమాలు చేస్తూ వచ్చిన రామ్.. ఇప్పుడు పూర్తిగా నిర్మాతగా మారబోతు న్నాడని సమాచారం. తన స్వంత సంస్థపై సినిమా నిర్మించే పనులు జోరుగా సాగుతున్నాయని తెలుస్తోంది. ఈ ప్రొడక్షన్ హౌస్ నుండి వచ్చే తొలి చిత్రానికి ఓ యువ దర్శకుడు దర్శకత్వం వహించనున్నాడు. ఇది అతని డెబ్యూట్ కావడం విశేషం. త్వరలోనే ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయ్యే అవకాశం ఉంది. ఇక వచ్చే ఏడాది తొలి నుంచే షూటింగ్ ప్రారంభం కానుందని ఫిలింనగర్ వర్గాలు చెబుతున్నాయి. ఇదొక యాక్షన్ ఎంటర్‌టైనర్ కావొచ్చని టాక్. ఇక రామ్ ఈ ప్రొడక్షన్ హౌస్ ద్వారా తానే హీరోగా చేసే చిత్రాలు మాత్రమే నిర్మిస్తాడా లేక ఇతర హీరోలతో కూడా న్యూ ప్రాజెక్ట్స్‌ను కూడా చేయాలనే ఆలోచనలో ఉన్నాడా? అన్న విషయమై స్పష్టత లేదు. కానీ ఇండస్ట్రీలోని మరో హీరో నిర్మాతగా మారుతున్నాడన్న సంగతే హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఏడాదిలోపు రామ్ తన బ్యానర్ పేరును అధికారికంగా ప్రకటించబోతున్నట్లు సమాచారం. అంతేకాక, అదే రోజు తన తొలి ప్రొడక్షన్ ప్రాజెక్ట్ వివరాలు కూడా వెల్లడి కానున్నాయి. రామ్ తన కెరీర్‌లో కొత్త దశకు అడుగుపెడుతూ నటుడిగా మాత్రమే కాదు.. నిర్మాతగానూ న్యూ కెరీర్ ను ప్రారంభించబోతున్నాడు. రామ్ గతంలో 'ఇస్మార్ట్ శంకర్'తో భారీ హిట్ కొట్టి మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకున్నాడు. ఇప్పుడు నిర్మాతగా కూడా అదే ఎనర్జీతో విజయాలను అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. రామ్ కొత్తగా ఎలాంటి కథలు ఎంచుకుంటాడు తన బ్యానర్ మీద ఎలాంటి ప్రయోగాలు చేస్తాడో చూడాలి.

# ఎలాంటి పాత్రలోనైనా నటనలో కింగే!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్- నాగార్జున కలిసి శేఖర్ కమ్ముల దర్శకత్వంలో చేసిన సినిమా కుబేర. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చి హౌస్ ఫుల్స్‌తో హిట్ దిశగా దూసుకెళ్తుంది. సినిమా చూసిన వారంతా శేఖర్ కమ్ముల రైటింగ్, డైరెక్షన్‌తో పాటూ ధనుష్, నాగార్జునల యాక్టింగ్ గురించి కూడా తెగ మాట్లాడుకుంటున్నారు. కుబేర సినిమాలో తన పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, ఆ పాత్ర అందరినీ మెప్పిస్తుందని నాగార్జున రిలీజ్‌కు ముందు నుంచే చెప్తూ వచ్చాడు. రిలీజ్‌కు ముందు నాగ్ మాటల్ని విని ప్రమోషన్స్ కోసం అలా చెప్తున్నాడనుకున్నారు కానీ నాగ్ చెప్పిన మాటలు ప్రతీదీ నిజమని కుబేర చూశాక అర్థమవుతుంది. కుబేరలో దీపక్ అనే సీబీఐ ఆఫీసర్ రోల్‌లో నాగ్ ఒదిగిపోయి నటించాడు. టాలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకడైన నాగార్జున కుబేరలాంటి సినిమాలో ఓ క్యారెక్టర్ చేయడమే కాకుండా సినిమా విజయంలో కీలక పాత్ర పోషించడం విశేషం. హీరోగా సినిమాలు చేస్తున్న నాగార్జున దీపక్ లాంటి పాత్రలో నటించడమే కాకుండా ఆ పాత్రను తన భుజాలపై మోసి అందరినీ మెప్పించడం సాహసమనే చెప్పాలి. అసలే టాలీవుడ్‌లో నాగార్జున ఇమేజ్ వేరు. టాలీవుడ్ మన్మథుడిగా అందరి మనసుల్ని గెలుచుకున్న నాగ్, కుబేర సినిమాలో డీ గ్లామర్ రోల్‌లో కనిపించడంతో పాటూ తన మేకోవర్ నుంచి బాడీ లాంగ్వేజ్ వరకు చాలా కొత్తగా కనిపించి తన నటనతో ఆకట్టుకున్నాడు. కుబేరలో నాగ్ నటనకు కేవలం ఆడియన్స్ నుంచి మాత్రమే కాకుండా విమర్శకుల నుంచి కూడా ప్రశంసలొస్తున్నాయి.

కేవలం సినిమాలో కీలక పాత్ర చేయడమే కాకుండా ఆ సినిమాను తన వంతు బాధ్యతగా ప్రమోట్ కూడా చేసి కుబేర సక్సెస్‌లో కీలకమయ్యాడు నాగ్. యాక్టర్‌గా తను పలు ప్రయోగాలు చేస్తున్నానని ఇప్పటికే చెప్పిన కింగ్ నాగా ర్జున, గతంలో బ్రహ్మాస్త్ర సినిమాలో కూడా కీలక పాత్రలో నటించి మెప్పించాడు. ఇప్పుడు కుబేరలో దీపక్‌గా అందరినీ మెప్పించి యాక్టర్ అన్నప్పుడు ఎలాంటి క్యారెక్టర్‌లో అయినా జీవించగలగాలని నిరూపించాడు. కుబేరలో నాగార్జున చేసింది సాఫ్ట్ క్యారెక్టరే అయినా అందులో కూడా నెగిటివ్ షేడ్స్ కనిపిస్తాయి. అలాంటి కత్తి మీద సాములాంటి పాత్రను నాగ్ చాలా అలవోకగా చేసి ఇప్పుడు ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాడు. కుబేర తర్వాత నాగార్జున రజినీకాంత్ హీరోగా వస్తోన్న కూలీ సినిమాలో విలన్‌గా నటించాడు. కుబేరలో దీపక్‌గా డీ గ్లామర్ రోల్‌లో నటించి మెప్పించిన నాగ్, కూలీ సినిమాలో సైమన్‌గా స్టైలిష్ పాత్రలో మెరవను న్నాడు.

# నా ఇష్టం... మరో ఫేస్ సర్జరీ చేయించుకుంటా!



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్స్ మాత్రమే కాకుండా హీరోలు కూడా అందంగా కనిపించడం కోసం సర్జరీలు చేయించుకుంటారు. కొందరు బరువు తగ్గడం కోసం సర్జరీలు చేయించుకుంటారు. అన్ని భాషల ఇండస్ట్రీలోనూ ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకున్న ముద్దుగుమ్మలు చాలా మందే ఉన్నారు. అయితే చాలా మంది తాము చేయించుకున్న సర్జరీల గురించి బయట మాట్లాడేందుకు ఆసక్తి చూపించరు. అసలు తాము ఎలాంటి సర్జరీలు చేయించుకోలేదు, కొన్ని ఎక్సర్‌సైజ్‌లు, కొన్ని రకాల క్రీమ్‌లు వాడిన కారణంగా అందంగా మారాము అంటూ ఉంటారు. కొందరు మాత్రం ఓపెన్‌గా ఔను మేము ఆపరేషన్ చేయించుకున్నాం, అందంగా కనిపించడం కోసం మేము మా ఫేస్‌కి సర్జరీలు చేయించుకుంటే మీకు ఏంటి అన్నట్లుగా మాట్లాడుతూ ఉంటారు. కమల్ నట వారసురాలు శృతి హాసన్ రెండో కేటగిరీకి చెందిన హీరోయిన్. ఈమె ఏ విషయంలోనూ గోప్యత పాటించదు. ప్రేమ విషయం మొదలుకుని శృంగార జీవితం వరకు అన్ని విషయాల పట్ల ఆమె చాలా ఓపెనింగ్ మాట్లాడేస్తూ ఉంటుంది. ఆమె మాట్లాడే మాటలు కొన్నిసార్లు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఒక స్టార్ హీరోయిన్ అయ్యి ఉండి, అది కాకుండా ఒక పాన్ ఇండియా స్టార్ కూతురు అయ్యి ఉండి ఇలా మాట్లాడుతారా.. ఇండియాలో అమ్మాయిలు మరీ ఇంత ఓపెన్‌గా ఉన్నారా అనిపిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా శృతి హాసన్ గురించి చర్చ జరుగుతూనే ఉంటుంది. ఆమె స్కిన్ షో ఫోటో షూట్ మొదలుకుని ప్రతి విషయం గురించి వార్తల్లో ఉంటుంది. తాజాగా శృతి హాసన్ తన సర్జరీల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తనకు చిన్నప్పటి నుంచి తన ముక్కు అంటే ఇష్టం ఉండేది కాదట. అందుకే ఆ ముక్కుకు సర్జరీ చేయించుకున్నాను. నా శరీరం నా ఇష్టం, నా ఇష్టానుసారంగా మార్పులు చేర్పులు చేయించుకుంటాను అన్నట్లుగా శృతి హాసన్ బోల్డ్‌గా మాట్లాడింది. ఆమె వ్యాఖ్యలు కాస్త ఎబెట్టుగా ఉన్నా నిజమే కదా అనిపించక మానవు. ముఖం మరింత అందంగా కనిపించడం కోసం ఫిల్లర్స్ కూడా వాడాను అంటూ ఓపెన్‌గానే చెప్పేసింది. అంతే కాకుండా భవిష్యత్తులో వృద్ధాప్యం వల్ల వచ్చే ముడతలు పోగొట్టుకునేందుకు గాను ఫేస్ లిఫ్ట్ కూడా చేయించుకుంటానేమో అంటూ ముందే తేల్చి చెప్పింది. ఇలా ప్లాస్టిక్ సర్జరీల గురించి, అందానికి సంబంధించిన సర్జరీ గురించి హీరోయిన్స్ మాట్లాడటం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. ఇక శృతి హాసన్ హీరోయిన్‌గా బిజీ బిజీగానే ఉంటుంది. ఆ భాష ఈ భాష... ఆ పాత్ర, ఈ పాత్ర అని చూడకుండా వచ్చిన ప్రతి ఒక్క పాత్రను చేసేందుకు ముందుకు వస్తుంది. అంతే కాకుండా ఐటెం సాంగ్స్‌లో నటించేందుకు రెడీ అంటుంది. సినిమాల్లో మాత్రమే కాకుండా వెబ్ సిరీస్‌లోనూ ఈమె నటిస్తుంది. ప్రభాస్‌తో ఈమె సలార్ 2 తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అది మాత్రమే కాకుండా తెలుగులో ఈమె మరో రెండు సినిమాలకు కమిట్ అయిందని, హిందీలో పలు సినిమాలు, సిరీస్‌లు ఈమె నుంచి రాబోతున్నాయని సమాచారం అందుతోంది. త్వరలోనే కూలీ సినిమాతో ఈమె రజనీకాంత్‌తో కలిసి రాబోతుంది. ఇలా బిజీ బిజీగా సినిమాలు చేస్తూ అందంగా కనిపిస్తున్న శృతి హాసన్ బోల్డ్ కామెంట్స్ చర్చనీయాంశం కావడం ఇదే కొత్త కాదు. మరీ ఇంత బోల్డ్‌గా మాట్లాడటం అవసరమా అని మాత్రం కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# రైటర్స్ అకాడమి, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర లఘు హాస్య నాటికల పోటీలు - ధరఖాస్తుకు ఆఖరి తేదీ 10-7-2025



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రైటర్స్ అకాడమి విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల లఘు హాస్య నాటికల పోటీలు (కామెడీ స్కిట్స్ కాంపిటీషన్) నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ మేడా మస్తాన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. దానికి సంబంధించిన నియమ నిబంధనలు విడుదల చేశారు. ఈ పోటీ లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.25,000/-, ద్వితీయ బహుమతి రూ.15,000/-, తృతీయ బహుమతి రూ.10,000/-, ప్రత్యేకంగా ఎంపిక కాబడిన (స్పెషల్ కన్సోలేషన్ ప్రైజులు) 3 స్కిట్‌లకు, ఒక్కొక్క స్కిట్‌కు రూ,2,000/- ఉంటాయని, అన్నిటికీ మెమెంటోలు, మొదటి మూడు బహుమతులు ప్రసంశా పత్రాలు ఉంటాయని, ఆసక్తి గల టీమ్/సంస్థ/క్లబ్‌లు రెండు కామెడీ స్కిట్‌లు ప్రదర్శించ వచ్చునని, ప్రతి కామెడీ స్కిట్ 10 నిముషాలకు మించి రాదని తెలియజేశారు. పాల్గొనాలనుకున్న ప్రతి టీమ్/సంస్థ/క్లబ్‌లు క్రింద నియమ నిబంధనలు పాటించాలని కోరారు. 1. కామెడీ స్కిట్ 10 నిముషాలకు మించి రాదు. 2.ఒక టీమ్/, సంస్థ/క్లబ్ రెండు కామెడీ స్కిట్‌లు ప్రదర్శించ వచ్చును. 3.ఎవరి మేకప్‌లు వారే, ఎవరి దుస్తులు (కాస్ట్యూమ్స్) వారే, ఎవరి వస్తువులు (ఆర్టికల్స్)వారే బాధ్యత వహించవలెను. 4. కామెడీ స్కిట్ ఏ మతమును గానీ కులమును గానీ, ప్రాంతాన్ని గానీ, వ్యక్తులను గానీ, రాజకీయాలను గానీ కించపరిచే విధంగా ఉండరాదు. 6. స్కిట్ ప్రదర్శించే టీమ్ నిర్ణయిచిన సమయానికి పావుగంట ముందుగానే వేదిక వద్ద సిద్ధంగా ఉండవలెను. 7.టీమ్ ఎంట్రీలు పంపుటకు ఆఖరి తేదీ 10.7.2025, 8.గడువు తేదీ ముగిసాక పోటీలు నిర్వహించే షెడ్యూల్ 10 రోజులు ముందుగా తెలియజేయడం జరుగుతుంది. 9.తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే. వాదోపవాదాలకు గానీ, ఉత్తర ప్రత్యుత్తరాలకు గానీ తావు లేదు. ఆసక్తి గల టీమ్/సంస్థ/క్లబ్, రైటర్స్ అకాడమి నిర్దేశించిన దరఖాస్తు ఫారంలో సంస్థ/టీమ్/క్లబ్ పేరు, టీమ్ కో ఆర్డినేటర్ పేరు, వారి సెల్ ఫోన్ నెంబర్, వారి చిరునామా, ప్రదర్శించబోయే రెండు కామెడీ స్కిట్‌లు పేర్లు, పాల్గొనే కళాకారుల పేర్లను వ్రాసి, తమ దరఖాస్తును తేదీ 10.7.2025 లోపు "రైటర్స్ అకాడమి (కామెడీ స్కిట్ కాంపిటీషన్), లీడర్ కార్యాలయం,వుడా లే అవుట్, మద్రి పాలెం, విశాఖపట్నం -530009 కు పోస్ట్ ద్వారా గానీ, స్వయంగా గాని అందజేయవలెను. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు. ధరఖాస్థు ఫారంకు, ఇతర వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు: 9441344365. 9676040165.





**ఈ రోజు విశాఖపట్నంలో జరుగుతున్న అంతర్జాతీయ యోగ దినోత్సవం (యోగాంధ్ర ) వేడుకలలో పాల్గొన్న రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ పీలా గోవింద సత్యనారాయణ**












**ఈరోజు విశాఖపట్నంలో జరుగుతున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం (యోగాంధ్ర) కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ & అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు**

# జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు










**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

శనివారం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యన్నారాయణ రావు ఆద్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా ప్రణాళిక అధికారి జి రామారావు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య, జిల్లా యోగాంధ్ర సమన్వయ అధికారి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె మనో రామ మరియు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో పాటు కలెక్టరేట్ ఉద్యోగులు అంతా పెద్ద ఎత్తున పాల్గొని యోగా గురువులు బి.అప్పారావు, ఎన్. నగేష్‌ల సూచనల మేరకు పలు రకాల యోగాసనాలను అభ్యసించారు. కలెక్టరేట్ ప్రాగణంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర వేదిక వద్దకు పెద్ద ఎత్తున ఉద్యోగులు అంతా ఉదయం 6.30 గంటలకే చేరుకుని పలు రకాల యోగా సనాలను దాదాపు ఒక గంటపాటు అభ్యసించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉద్యోగులు పలు రకాల యోగసనాలను అభ్యసిస్తూ ప్రపంచ యోగా దినోత్సవ సమ్మేళనానికి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక లక్షకు పైగా ప్రాంతాల్లో 2 కోట్ల మంది ప్రజలు పాల్గొనేలా నిర్వహించిన ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో కలెక్టరేట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ యోగా ప్రదర్శనలో కలెక్టర్ కార్యాలయం భూ పరిపాలన, సమన్వయ, మేజిస్ట్రియల్ సూపరింటెండెంట్లు పి వి రత్నం, ఎస్ ఎస్ వి ఎస్ నాయుడు, రాజేశ్వరి, అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గాయత్రిలో ఘనంగా 'యోగ 'డే







**(రాజధాని వార్తలు):** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఘనంగా యోగ డేను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యనారాయణ "యోగ ప్రతీ విద్యార్థి జీవితంలో భాగం కావాలని, దానివలన ఆరోగ్యం, మేధా వృద్ధి అవుతాయన్నారు. కార్యక్రమంను కళాశాల జాతీయ సేవా పధకం రెండు విభాగలు నిర్వహించడం జరిగింది. వంద మంది విద్యార్థులు పాల్గొని యోగా సనాలు వేశారు. దృశ్య రూపంలో యోగ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ సమన్వయకర్తలు అప్పలనాయుడు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆంజ నేయస్వామి 20వ వార్షికోత్సవం





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కసింకోట మండలం ఏనుగు తుని గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గొంతిని చిరంజీవి ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయస్వామి 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు అయిదు గంటల నుండి వేద పండితులు అప్పలాచార్యులు పర్యవేక్షణలో అష్టోత్తర పూజలు పంచామృత అభిషేకములు హెూమాలు గొంతిని చిరంజీవి గొంతిని నూకరాజు దంపతులు కూర్చొని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ ఉప్పులూరు అప్పలనాయుడు, మండల తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు, తెరపల్లి శ్రీను, బొల్లి వెంకటరమణ, గొంతిని విజయ్, పీలా సామీలు, యాదగిరి మణికంఠ, పీలా చిరంజీవి, మోటూరు ఉపేంద్ర, గతడ నాగార్జున, గొల్లవిల్లి శ్రీనివాసరావు, సేనాపతి నాని మరియు మహిళలు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొని ఆంజనేయ స్వామి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# పెంటపాడు ఆర్ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**- పెంటపాడు ఆర్ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి**



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** పెంటపాడు ప్రభుత్వ ఆర్ఐటీఐ కళాశాలలో పెంటపాడు మరియు అప్పర్ సీలేరు కేంద్రాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి రెండవ విడత ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 15 వరకు www.iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు జూలై 17న దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలి. పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు జూలై 21 ఉదయం 10:00 గంటలకు పెంటపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించనున్న కౌన్సిలింగ్‌కు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరు కావాలని ఆయన తెలిపారు. ప్రవేశానికి సంబంధించిన మరిన్ని వివరాలకు 9885549944, 9494377833 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan